# రసజ్ఞులు



ఆదివారం మాకు ఆటవిడుపు. ఆ రోజు ఉదయం నుంచీ మధ్నాహ్నం కడుపులో ఎలకలు పరిగెట్టేంతవరకు మేం నలుగురం చేరి సాహిత్యం చర్చ జరుపుకొంటాం. జీవితంలో – ఉద్యోగంలో చేరేంతవరకు, జీవితం ఓ లాగ ఉంటుంది. ఉద్యోగంలో చేరాక జీవితం మలుపు తిరుగుతుంది. ఆనాటివరకు ఉండని క్రమశిక్షణ, ఓ పద్ధతీ ఆనాటినుంచి అలపడతాయి. క్రమబద్ధంగా జీవితం గాడిన పడి నడుస్తుంది, అనిపిస్తుంది మొదట్లో, కానీ కొన్నాళ్ల తర్వాత ఆ గానుగెద్దుజీవితం విసుగెత్తనారంభిస్తుంది. కొంత కొత్తగాలి పీల్చుకుంటూ మళ్ళీ బతకాలనే ఆశ చిగురిస్తూ ఉంటుంది.

అందుకే అంటున్నాను ఆదివారం మాకు ఆటవిడుపు అని!

సుబ్బారావుగారు కథ చదివారు. కొత్తగా రాసిన కథ. అప్పులిచ్చే ఆఫీసు బంట్రోతు ఆదినారాయణ కథ అది. ఆదినారాయణ ఎవరో మాకు తెలుస్తూనే ఉంది. అందులో ప్రతి సంఘటనా జీవితంలో మాకు తారసపడ్డదే కావటంతో మేమూ కథలో లీనం అయ్యాం.

ఆ తర్వాత నారాయణగారి కథ. కొసమెరుపు కథ. ఎన్నో మైళ్ళదూరం నుంచి వేగంగా, జలపాత ఉధృతంతో వచ్చిన విద్యుత్తు అక్కడ ఆ స్థంభం దగ్గర షార్ట్‌సర్క్యూట్ పొందితే... ఆ షార్ట్ సర్క్యూట్ పేరు కొసమెరుపు అవుతుంది. ఆ మెరుపులో మెదడంతా షాక్ తినేస్తుంది. బాగుంది కథ అనిపిస్తుంది.

అందరి తలలూ ఆనందంతో, బాగా రాశారనే మెచ్చుకోలుతో అంగీకారంతో ఊగాయి. నారాయణగారు వెంటనే టీకి ఆర్డరు ఇచ్చేశారు.

ఇంట్లో పాల కప్పుల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. ఇపుడో, ఇంకో క్షణంలోనో టీలు వచ్చేస్తాయి.

ఈలోగా రాజుగారి కవిత. చిన్న పదాలలో గొప్ప అర్థాలతో సాగే కవిత్వం అది. అల్పపదాల అనల్ప అర్థాల కవిరాజు! 'గడ్డాలు పెరగకపోతే రేజర్లు, భూమంతా చదునుగా ఉంటే బుల్‌డోజర్లు... ఎందుకు' అంటారు ఆయన. అన్నీ తెలిసిన పదాలే. గడ్డం తెలుసు, రేజర్ తెలుసు, ఎవరో యువనాయకుని ధర్మమా అంటూ బుల్‌డోజర్లూ తెలిశాయి. కానీ ఆ పదాల వెనుక, ఆ పదాల కూర్పులో అంత అర్థాన్ని అమర్చటం...

"అద్భుతం!" అనేశాం అందరమూ, ఏకగ్రీవంగా.

అంత రసవత్తరంగా సాగే తరుణంలో... నేను అంత క్రితం రాసిన ప్రేమకథ చదివితే, అంతకన్నా అన్యాయం ఇంకోటి మిత్రులకూ చేయలేను, సాహిత్యానికీ చేయలేను, అందుకే నేనేం రాయలేదనేశాను.

సుబ్బారావుగారు నా కథల వాసన పట్టేశారు. "చదవండి!" అన్నారు, పర్వాలేదు అన్నట్లుగా.

రాజుగారు చిన్నగా నవ్వుతూ అన్నారు. "మన గురుడు ప్రేమకథ రాసినట్లు ఉన్నాడు"!

"లేదు, రాయలేదు!" అన్నాను. టీలు వచ్చాయి. అందరం తాగుతున్నాం!

అప్పుడు అన్నాడు గురుమూర్తి "ఈ వేళ నేనూ ఒక కథ చదువుతాను!" అని!

అందరం అద్భుత ప్రపంచంలోంచి ఆశ్చర్యంలోకి దూకాం.

"మీర్రాశారా కథ?" అనడిగాను నేను ముందుగా తేరుకుంటూ.

గురుమూర్తిగారు కథా రచయితకాదు, కనీసం ఇన్నాళ్ళవరకూ! ఆయన కథలు చదువుతారనే సంగతీ మాకు తెలియదు ఇటీవలవరకూ! ఈ సాహిత్య సమావేశాలకు ఆయన రావటం ఆరంభించి ఆర్నెల్లయిందో, లేదో....

అయినా...

రాజుగారు నవ్వుతూ అన్నారు: "అంటువ్యాధి కాబోలు!!"...

"కవిత్వం అంటువ్యాధి కాగలదుకానీ, కథలు కష్టమండీబాబూ!" అన్నారు నారాయణగారు.

రాజుగారు తప్ప మిగిలిన వాళ్ళం రచయితలం కాబట్టి, నారాయణగారి మాటకు ఓటేశాం.

"కవిత్వం అంటే ఏముందండీ, నాలుగు వాక్యాల డొక్కలు చించి ఒక వాక్యాన్ని నాలుగు పదాలుగా చేసి, ఒకదానికింద ఒకటి రాసుకొంటూ పోతేసరి, చదివేవాడికి అర్థమయితే వాడి అదృష్టం, కాకుంటే కవిగారి ప్రయోగం!" అన్నాను నేను.

"కవిత్వం కాదండీ, కథే... కథే రాశాను" అన్నారు గురుమూర్తిగారు. "చదవండి!... ఇదండీ, ఇలాగుండాలి! సాహిత్య సమావేశాలకు ఇలాంటి ప్రయోజనమే మనం ఆశించాలి!" అన్నారు సుబ్బారావుగారు.


గురుమూర్తిగారు లాల్చీజేబులోంచి కథల కాగితాలు తీశారు. ఆయన మూడ్‌ను డిస్టర్బ్ చేయడం దేనికని అందరమూ ఊపిరి బిగపట్టి వినటం ప్రారంభించాం.. ఆయన మొదలు పెట్టారు.

❖ ❖ ❖

– ఆ రోజు ఆదివారమే. అందరికీ ఆటవిడుపు ఉంటుంది. కానీ సూర్యానికి ఆ రోజు చాలా బిజీరోజు.

వెంకటరావు ఉదయం తొమ్మిదికే వస్తానన్నాడు. కానీ రాలేదు. సూర్యానికి ఒకటే ఆత్రుతగా ఉంది.

చదువుకొనే రోజుల్లో సంపాదించగలగడం అందరికీ చేతనయ్యే విద్యకాదు. ఇపుడంటే "ఎర్న్ వైల్ యూ లెర్న్" అనే పథకాలు ఉన్నాయికానీ అపుడు అస్సలు లేవు. అందుకే పియూసి అంతా ఖర్చుతోనే గడిచిపోయింది సూర్యానికి.



అంత క్రితం రోజునే వెంకటరావు హితబోధ చేశాడు! డబ్బు ఎలా సంపాదించాలో, సంపాదించడానికి వయసుతో ఎలా నిమిత్తం లేదో, ఏ కులమత లింగభేదాలు లేకుండా డబ్బు సంపాదించడానికి ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్నీ కలగాపులగంగా చెప్పాడు.

ఎన్ని చెప్తేనేం, సూర్యానికి అర్థం అయింది ఒకటే. ఇపుడయినా డబ్బు సంపాదించవచ్చుని!!

"నువ్వు ఊ అంటే చాలురా! రోజూ అయిదు రూపాయలు వచ్చే ఏర్పాటు చేసే పూచీ నాది!"

ఊ అనేశాడు సూర్యం.

చిన్నతనం కాబట్టి అంతరాత్మలు, ప్రబోధాలు, నీతినియమాలు-ఇలాంటివేవీ అడ్డం రాలేదు. పెద్దయ్యాక ఎలాగూ అవి అడ్డం రాక తప్పదు. వాటిని తప్పించుకొని పోకాతప్పదు!

డబ్బు సంపాదించే చిట్కాల్లో ఒకటి చెప్పాడు వెంకటరావు. సూర్యం ఆ పద్ధతిని ఊపిరి బిగబట్టి విన్నాడు.

సులభంగానే ఉంది.. కానీ...

"పట్టుకొంటే...?" అన్నాడు సూర్యం.

"ఎవరు పట్టుకొనేది?" అనడిగాడు వెంకటరావు.

"యాదగిరి పట్టుకోవచ్చు, నరసింహమూర్తి, విశ్వనాథం.."

"ఏడిశారు! యాదగిరికి నెలకో రూపాయి ఇస్తే సరి, వెధవ, వాడే ఊరుకొంటాడు, ఇక విశ్వనాథంగారంటావ్. ఆయన కళ్ళజోడు సర్దుకుంటూ ఆ గదిలోనే ఉంటారు. ఆయనకు బయటకొచ్చే టైం ఉండదు. ఓపికలేదు. ఇక మిగిలింది నరసింహమూర్తి. వాడు కొంచెం కష్టమే, కానీ, అదీ పర్వాలేదు. వాడు అటుకేసి, అదేరా- మీ ప్రమీల, పద్మావతి, అరుణలకేసి వెళ్ళాడంటే మరో అరగంట వరకూ రాడు. ఆ సమయం గుర్తు పెట్టుకుంటే చాలు... పనంతా అయిపోయినట్లే!" అన్నాడు వెంకటరావు ధైర్యం చెబుతూ.

వెంకటరావు అలా అన్నాక, సూర్యానికి ధైర్యం వచ్చింది - నిజమే, తేలికే ఈ పద్ధతి. ఇంతకాలంనుంచి చదువుతున్నా తట్టింది కాదు తనకు అనుకొన్నాడు.

కొన్ని రకాల సంగతులు కొందరికే తడతాయి. ఒకే స్కూల్లో చదివినా, పక్కపక్కనే కూర్చుని చదివినా ఒకరు కలెక్టర్ అయితే, మరొకడు బిల్ కలెక్టర్ కూడా కాకపోవచ్చునంటే ఇదే దీనికి కారణం!!

వెంకటరావు చెప్పిన పద్ధతికి సూర్యం నిన్ననే శ్రీకారం చుట్టాడు. ఈవేళ దాంట్లో రెండో భాగం పని ఉండిపోయింది. నగదుగా మార్చుకోవటమే పని!

వెంకటరావు వచ్చేలోగా సూర్యం రెండుసార్లు ఇంట్లోకి వెళ్ళి నిన్న డిసెక్షన్ బాక్స్‌లో ఉంచి తెచ్చిన పెన్సిలిన్ సీసాను చూసుకొని వచ్చాడు.

సీసాలో మెరుస్తూ ఉన్న ఆ ద్రవం సూర్యాన్ని ఆప్యాయంగా పలకరించింది. రెండు సార్లునూ!!

"........"

కథ చదువుతున్న గురుమూర్తిని ఆపారు రాజుగారు: "మీరు చెప్పే కథ తెలిసి పోయిందండీ" అంటూ. గురుమూర్తి నవ్వేశారు.

నేను, నారాయణగారు, సుబ్బారావుగారూ కూడా ఆ నవ్వులో పాలు పంచుకొన్నాము.

– కానీ ఎన్నాళ్ళనుంచో నాలో ఉన్న ప్రశ్నలన్నీ ఆవేళ బయటకు వచ్చాయి.

"వాళ్ళ మాటలకేం గురుమూర్తిగారూ, మీ మొదటి కథకు ఇలా భంగం కలగటం నేను సహించను. మీరు కానీయండి!"

గురుమూర్తిగారు ఆ కథ రాసిన కాగితాలను నావైపు విసరబోతూ అన్నారు "ఇవి తీసుకోండి, మీరు చదువుకొందురుగాని"

"ఆహా, అలా కుదరదు, మీరు కానీయండి. రసజ్ఞులైన పాఠకులు దొరకటం కన్నా రచయితకు లభించే అదృష్టం ఏముంది? మీ కథను ఇంత శ్రద్ధగా వినే శ్రోత ఉండగా ఇంకేం! కానీయండి!" అన్నారు నారాయణగారు.

గురుమూర్తి నవ్వి నెమ్మదిగా అన్నారు: "ఇంకా ఎందుకండీ, తర్వాత కథ మీకంతా తెలిసిపోయింది కదా! నేను ఊరికే అవుట్‌లైన్స్ చెప్పేస్తాను!" అంటూనే కాగితాలను మడిచి లాల్చీజేబులోకి తోసేసుకున్నారు మళ్ళీ.

"సరే, సత్యం, చెప్పేది విను! ఆ రోజు సూర్యం పెన్సిలిన్ సీసాలో చూసింది – పాదరసం!

కాలేజీ లేబరెటరీలో ఏవో ప్రయోగాలకోసం ఉంచిన మెర్క్యురీ అది! రోజూ... రోజూ కాకపోతే కెమిస్ట్రీ ప్రాక్టికల్స్ ఉన్నపుడల్లా సూర్యం పెన్సిలిన్‌సీసానిండా బయటకు తెచ్చేవాడు. అది తెచ్చి వెంకటరావుకు ఇస్తే సీసాకు అయిదు రూపాయలు ఇచ్చేవాడు.

ఇది కాలేజీ ఆఖరివరకూ సాగేదే కానీ దురదృష్టం.... ఓరోజు పెన్సిలిన్ సీసా, డిసెక్షన్ బాక్స్‌లోంచి జారీ కిందపడింది.

లేబరెటరీ అంతా తళతళ మెరిసే ముత్యాలు!

మెర్క్యురీ కిందపడి తునాతునకలయింది. ఆ చప్పుడు యాదగిరి విన్నాడు కానీ నరసింహమూర్తి వినలేదు. అతను ఏ లీలారాధనలోనో, ప్రమీలా ప్రేమాయణంలోనో ఉండి ఉంటాడు. కానీ ఏంచేయాలి? కిందపడింది ఎత్తలేంకదా! ఎంత ప్రయత్నించినా పాదరసం మరింత చిందరవందర అవుతుందే కానీ దగ్గర చేరదుకదా! – ఆఖరికి దొరికిపోయాడు సూర్యం.

వారం రోజుల సస్పెన్షన్‌తో సూర్యం అవమానం నుంచి బయటపడ్డాడు.

"ఇది అతని జీవితంలో మొదటి అధ్యాయం!" అంటూ ఆగాడు గురుమూర్తి.

"ఆ తర్వాతే మీరు ఈ ఫ్యాక్టరీలో చేరారన్న మాట!" అన్నారు నారాయణగారు.

నాకు జ్ఞానోదయం అయింది. ప్రతివాడు ఏకంగా గొప్పవాడయిపోడు. వాడి గొప్పతనం వెనుక ఎప్పటిదో చిన్నతనం కథ ఉంటుంది. ఆ చిన్నతనం గురించి గురుమూర్తి చెప్పనే చెప్పారు. ఎటొచ్చీ ఆయన కథలో సూర్యం అనే పేరు తనకు పెట్టుకొన్నారు. అంతే తేడా!!

తర్వాతది అంతా ఇటీవలి చరిత్ర. తెలిసిన వాళ్ళను కదిపితే కథలు కథలుగా చెప్తారు.

కానీ ఎవర్నో అడగటం దేనికి? ఎదురుగా ఆయననే ఉండగా....! "ఏం జరిగిందో ఆ తర్వాత..."

"ఏం జరుగుతుంది? అక్కడ తిన్న తన్నులు అక్కడే మర్చిపోయాం. ఇక్కడ చేరాను. కెమిస్ట్రీ లేబరెటరీలో ఉండే పదార్థాల విలువ ఏమిటో తెలిసిన వాడిని! ఇక్కడ నన్ను ఏకంగా ఆ సెక్షన్‌కే వేశారు. రోజూ మాకు మెర్క్యురీతోనే పని.

దొంగకే ఇచ్చారు తాళాలు అనుకొన్నాను. దొంగ అనుకోవడం తప్పేకానీ నిజానికి ఎవరు కాదు దొంగ అనుకొన్నాను, నన్ను నేను సమర్థించుకొంటూ.

దోపిడి అనేది ఎప్పుడూ ఖచ్చితంగా దోపిడి లాగానే ఉంటుదనుకోనక్కర్లేదు. నీకు చెందనిది దోచుకోవటం ఎంత తప్పో నీకు చెందబోయేది దోచుకొన్నా అంతే తప్పు.

ఇక్కడ ఈ ఫ్యాక్టరీలో తల తిప్పి ఎంత ప్రయత్నించి వెతికినా, నా ఊరికి, నా జిల్లాకు, నా రాష్ట్రానికి సంబంధించిన వాడెవడూ కనపడడు. అయినా ఈ ఫ్యాక్టరీ నా రాష్ట్రంలో ఉంది. ఎవడికి లాభం? పక్కన ఉండే రాష్ట్రం వారికి! నాకు ఒళ్ళు మండేది. వాళ్ళు చేసేది ఓ రకం దోపిడీ. మన యువకుల ఉద్యోగాలు వాళ్ళు దోచుకొనేవారు. మరి నేను ఈ ఫ్యాక్టరీని దోచుకొంటేనేం? అనే తెలివి తక్కువ కక్ష అధికమయేది నాలో.

ఆ పనే చేయనారంభించా.

రోజూ.. కాలేజీలో చిన్న తనం, అనుభవం లేమివల్ల చేసిన తప్పుల్ని చేయక... ఎప్పుడూ జాగ్రత్తపడ్డాను.

రోజూ నా జేబులో ఓ లావుపాటి ఫౌంటన్ పెన్ లాంటిది పట్టుకెళ్ళేవాడిని. వెళ్ళేటప్పుడు ఖాళీగా ఉండే ఆ పెన్ తిరిగి వచ్చాక నాకు ధనలక్ష్మీ ప్రసాదం చేసేది.

అంత పెద్ద ఫ్యాక్టరీలో కొన్ని బిందువుల మెర్కురీ పోతేనేం, ఎవడికి తెలుస్తుంది?? అనుకొనేవాడిని.

అప్పట్లోనే వెంకటరావు-అదే నాకు కాలేజీలో హితబోధ చేసిన - వాడు కూడా చేరాడు ఇదే ఫ్యాక్టరీలో! ఇపుడు తోడు దొంగలం! ఒకే కన్నం. ఒకే ఇంటికి!!

కానీ... ఓ రోజు ఫ్యాక్టరీగేటుముందు సెక్యూరిటీ చెక్ జరుగుతూ ఉండగా జేబులోంచి ఆ ఫౌంటెన్‌పెన్ కిందపడింది. పెన్ను నా దురదృష్టం కొద్దీ ఆ గార్డుకాలికింద పడింది. అంతే! అందులోని మెర్క్యురీ నేలంతా చెదిరి, నా అపరాధాన్ని వేనోళ్ళ చెప్పింది. అందరూ నోళ్లు తెరిచి విన్నారు. పాదరసం చూపిస్తున్న సాక్ష్యాన్ని చూశారు.

అందరు ఇలా నేరాన్ని చూస్తోంటే, వెంకటరావు - నా కన్నా సెక్యూరిటీ గేట్ వద్ద వెనుక ఉన్నవాడు జాగ్రత్త పడ్డాడు. వెనక్కు వెళ్ళి ఫ్యాక్టరీలో తను తెస్తున్న పాదరసాన్ని వదిలి వచ్చేశాడు. అప్పటికే నామీద నేరారోపణ జరిగింది, సస్పెండ్ చేశారు.!!"

అందరం విన్నదీ అదే!

కథ అదే. కథనం మాత్రం కొంత తేడాలో ఉండేది. ఎవరివీలును బట్టివాళ్లు ఎవరి స్తోమతను బట్టి వాళ్ళు కల్పనలు జోడించి కథను మరింత రసవత్తరం చేసేవారు.

నేనే అడిగాను తేరుకొంటూ "బాగుందండీ, మరి వెంకటరావు కథ ఏమయినట్లు?"

గురుమూర్తి నవ్వారు! "ఏమవుతుంది. తెలివైనవాడు కాబట్టి, నానేరం ఋజువైన తర్వాత వెంకటరావు ఫ్యాక్టరీకి రాజీనామా చేశాడు. కాబట్టి వెంకటరావుకు ఫ్యాక్టరీ వాళ్ళు గౌరవ మర్యాదలతో వీడ్కోలు చెప్పారు. దురదృష్టవంతుడిని కాబట్టి, తీసేసారు నన్ను! వెంకటరావు ఈ రోజున ఫ్యాక్టరీ పెట్టుకొంటున్నాడు స్వంతంగా!" గురుమూర్తి క్షణం ఆగి మళ్ళీ చెప్పటం ప్రారంభించారు. "ఇద్దరం చేసిందీ ఒకే నేరం! కానీ నేను దొరికాను - దొంగను! అతను దొరకలేదు - దొర అయ్యాడు. వెంకటరావు ఈ నేరం చేశాడని నేను చెప్తేకానీ, ఎవరికీ తెలీని రోజు ఇది!"

ఆయన ఆగారు.

రాజుగారు నెమ్మదిగా అన్నారు. "సారీ గురుమూర్తిగారూ! మీ గురించి తెలుసుకానీ... ఇంత వివరంగా తెలీదు!"

"అందుకే చెప్పానండి, నిజానికి నేనూ సంపాదించాను బాగానే, కానీ అదంతా ఖర్చు పెట్టుకోవటానికే సరిపోయేది నాకు! అందుకే ఈ రోజు మళ్ళీ ఉద్యోగంకోసం వెంకటరావు దగ్గరకే వెళ్ళి నిలబడుతున్నాను."

నేను ఉలిక్కిపడ్డాను. "ఆయన ఇస్తారా?"

గురుమూర్తి నవ్వారు. "నిజమే, ఇవ్వకపోవచ్చు. కారణం మేమిద్దరమూ రసజ్ఞులమే! ఇంకోవిధంగా ఇవ్వొచ్చు! కారణం నేనే వాడిని పరోక్షంగానైనా రక్షించగలిగాను!"

గురుమూర్తి అనేది నిజమే, కానీ వెంకటరావు తెలివైన వాడైతే, గురుమూర్తికి ఉద్యోగం ఇవ్వడు. ఎవ్వడూ కోరి కోరి రహస్యాలు తెలిసిన వాడిని పక్కన ఉంచుకోడు. తప్పనిసరి అయితే తప్ప!! వెంకటరావుకు గురుమూర్తి తప్పనిసరికాదు!!

కథ విషాదాంతం అవుతుందని అందరికీ తెలుసు. కథకులమయిన మేం పసిగట్టగలిగాం!

రెండు నిముషాల నిశ్శబ్దం తర్వాత, నారాయణగారు టీ కోసం మళ్ళీ ఆర్డర్ చేశారు.

*- జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, 1980*